కథా నిలయం
4757
శ్రీకాకుళం

# మయసభ

ఆమె నోటివెంట మాటరాలేదు!

ఆ మాట వినగానే, అతను ఉన్నపళంగా విరుచుకుపడ్డాడు.

“ఇలా కొంపంతా ఊడ్చి మీ పుట్టింటివాళ్ళకి కట్టబెడితే. నేను, నా పిల్లలు చిప్ప చేత్తో పుచ్చుకుని రేపు వీధులవెంట వెళ్ళాలి. దేనికైనా ఒక హద్దు ఆపు ఉండాలి. బుద్ధి లేకపోతేసరి!” రుసరుసలాడుతూ, కోటు వంకెకు తగిలించి. తీక్షణంగా ఓ చూపు విసిరాడు ధర్మపత్ని వైపు.

“అమ్మాయ్ ... కస్తూరి ... కాసిని మంచినీళ్ళు పట్రా” కేకేశాడు.

“అహఁ! ఇక్కడ రూపాయలు కోళ్ళు ఏరుకు తింటున్నా యనుకుంటున్నాడా అంట!”

“మీవద్ద ఉంటేనే సర్దండి. లేకపోతే. మిమ్మల్ని కొట్టి, కొరతన వేస్తాడా? దేనికి ఆ రుసరుసలు? కాలం ఎప్పుడూ ఒకేలా గుండదు. ముష్టి యాభై రూపాయలకోసం, ఎందుకు ఇన్ని సాధింపులు? లేవంటే సరిపోయేదానికి.” ఆమె వంటగదిలోకి వెళ్ళింది.

“పాడు పిల్లలు ... ఎక్కడి వస్తువు లక్కడుంచరుగదరా! దీనితో అవసరం ఎవడికి కలిగిందిరా? ఆఁ ... ఉందిలే!” వివేకానందుని ఉపన్యాసాల పుస్తకం చేతిలో పట్టుకొని వంటగదిలో ప్రవేశించాడు.

“ఇదిగో ... నిన్నే ...” నిమ్మరసంలో పంచదార కలుపుతూ, ఆమె తల ఎత్తి చూడలేదు.

“ఇదిగో ... నిన్నే ముష్టి యాభై రూపాయలని తేలిగ్గా అనేశావు. నీవు సంపాదిస్తే, నీకు తెలుస్తుంది.”

“మేం సంపాదిస్తే ఈ మాటలు పడవలసిన కర్మదేనికి? తీసు

కోండి." నిమ్మరసం గ్లాసు చేతిలో పెట్టింది. తియ్యని, పుల్లని నిమ్మరసం గొంతులో జారి, ఉడికిపోతున్న శరీరంలో వేడి ఒక మోతాదు తగ్గించింది.

"అంటే నీకు కోపం వస్తుందిగానీ ఇటుచూడు. ఇదివరకు ఇచ్చిన రెండువందలు ఏం చేశాడు చెప్పు ? అప్పులవాళ్ళు ఇంటి చుట్టూ తిరుగుతున్నారు. పరువు పోతుందని. కాళ్ళావేళ్ళాపడి, మళ్ళీ డబ్బు తీసుకు వెళ్ళి, పేకాటలో పెట్టాడా ? ఇవి ఇప్పుడు ఏ బ్రాకెట్‌లో పెట్టడానికో అని నా అనుమానం." కొద్దికొద్దిగా చప్పరిస్తూ, పెరట్లో బాదం చెట్టువైపు నడిచి, స్టూలుమీద చతికిలబడ్డాడు ఆమెకేసి చూస్తూ. ఆమె కాకరకాయల నుండి నీరు వారుస్తూ సమాధానం చెప్పింది.

"సరే, ఎప్పుడో, ఏదో చేశాడని దానినే పట్టుకుని, సాధిస్తే ఎలా ? ఇప్పుడు వాణ్ని మనం ఆదుకోకపోతే ఏం బాగుంటుంది ? ఆ గొలుసు హీనపక్షం పందయినా అమ్ముతుంది. ఈవేళతో గడువు తీరిపోతుందిట ! ఈ రోజు డబ్బు కట్టకపోతే గొలుసు వాడే స్వాహా చేస్తాడట !"

"ఛీ...ఛీ... ఎంత బరితెగించిపోయాడు ! ఇల్లాలి వంటిమీద నగలు తాకట్టు పెట్టేంతవరకు వచ్చిందన్నమాట, వీడి వ్యవహారం. ఇద్దరు పిల్లలు కలిగినా, మీ వాడు దారికి రాలేదన్నమాట."

"అదేకదూ నేను నెత్తి నోరు పెట్టుకుని చెప్పేది ? అమ్మడూ ! బొయ్యికింద కట్టెలు లోనికి నెట్టు."

"సరే. ఇంకేం కానియ్యి. ఆ కోమటి రంగయ్యకు నే నెలాగో చెప్పుకుంటా ! ఆ డబ్బు ఇటు సర్దు. కర్మ. మనం బాగుపడలేం."- ఒక్క క్షణం ఆగి మళ్ళీ అన్నాడు... "అసలు ఈ గొలును తాకట్టు పెట్టిన మాట నిజమేనా ?"

"అయ్యో రామ ! వాణ్ని వెంటబెట్టుకునే వచ్చాడండీ. వాడి గడ్డం, వాడు పాడుకాను. తురకసాయిబు—ఇంట్లోకి వస్తూంటే చీదర పుట్టుకు వచ్చింది. రోజుకి అణా వడ్డీఅట ! వడ్డీ ముందుగానే పుచ్చేసుకుని మిగతా

డబ్బు ఇచ్చాడట! సరే, మీ బావగారు వచ్చాక, వారి నడిగి చూస్తా నన్నాను. అలా అంటే, కాదే! ఎలాగయినా. ఈ పైకం మీరు సర్దాలి. లేకపోతే, నా పరువు పోతుంది' అని కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడండీ. మీ ముందు నిలబడడానికి చచ్చిపోతున్నాడు!"

"అసలు పరువంటూ ఉంటేనా...పోవడానికి..." విసవిసా లోప లికి వెళ్ళాడు. దండెంమీద నుండి లుంగీ తీసుకొని, ధోవతి మార్చు కున్నాడు. పంచపాళీలో ఉన్న మడతకుర్చీ గదిలోకి లాక్కుని, వివేకా నందుని ఉపన్యాసాలు చదువుకోసాగాడు. బయట చిన్నపిల్లలు వెన్నెట్లో నీడ తొక్కడం ఆడుకుంటున్నారు. "ఔట్. ఔట్." అని పెద్దగా అల్లరి అయిపోతూంది. విసుక్కుంటూ గది తలుపులు వేసుకున్నాడు. 8 గంటలవేళ అతని శ్రద్ధ పుస్తకంనుండి మళ్ళింది.

"మామయ్యా. మామయ్యా!" పిల్లలు చుట్టుముట్టిన కేకలు.

"ఆ. రైట్. ఆడుకోండి! ఆడుకోండి! నాన్నగారు వచ్చారా?" అంటూ ముద్దుగా అడిగాడు.

ఆపైన. "అక్కాయ్...అక్కాయ్" అంటూ వంట గదిలోకి దారి తీశాడు అతను.

"ఇష్. మీ బావ పక్కగదిలో చదువుకుంటున్నార్రా! పెద్దగా మాట్లాడకు. అయితే డబ్బు కావలిసిందేనా?" ఆమె మధ్య గదిలోకి ఎదురువచ్చి మాట్లాడటం మొదలుపెట్టింది.

"అవసరం లేకపోతే ఇన్నిసార్లు తిరుగుతానా అక్కయ్యా! చూడు వాడు నన్ను దెయ్యంలా వదలకుండా తిరుగుతూంటే" బయటికి వేలు చూపించాడు వినయంగా.

"ఒరేయ్! శీనూ...నాకు సుతరాం నచ్చలేదురా నీ వ్యవహారం. నీవు బతికి ఎవరిని సుఖపెడుతున్నావ్. నాన్న ఎంతో పెద్ద చదువులు చెప్పించి నిన్ను గొప్పవాణ్ణి చెయ్యాలనుకుంటే, చదువు సంధ్యలు లేకుండా తిరిగావు. సగం నీ దిగులుతోనే పోయార్రా నాన్న. ఉన్న

ఆసి అంతా ఊడ్చిపారేశావు ! మీ బావగారు వాళ్ళని వీళ్ళని బతిమిలాడి నీకో ఉద్యోగం ఇప్పిస్తే అక్కడ నీ కాలు నిలవకపోయె ! ఇంక ఎప్పుడురా నీకు తెలిసివచ్చేది? ఏ ఘడియలో పుట్టావోగానీ ... ఇప్పటికైనా బుద్ధి మార్చుకోరా !"

"అక్కయ్యా ! అతనికి డబ్బిచ్చి వస్తా. బయట నిలబడ్డాడు నా కోసం. తరవాత తీరిగ్గా మాట్లాడుకుందాం..."

"ఇవిగోరా. యాభై రూపాయిలు, మీ బావ ఎవరినో చేబదులు అడిగి తెచ్చారు రెండు రోజుల్లో సర్దుతామని చెప్పి" డబ్బు అతని చేతిలో పెట్టింది.

"రెండు రోజుల వరకు ఎందుకు? రేపు ఉదయమే తెచ్చి ఇస్తాను. రేపటివరకు ఆగనంటే కదూ ఇటు వచ్చింది. సరే ! నేను వెళతాను అక్కయ్యా. మళ్ళీ పెద్ద బజారుకి వెళ్ళి 'నెక్లెస్' విడిపించుకుని ఇంటికి వెళ్ళాలి...మీ మరదలు ఎదురుచూస్తూ వుంటుంది" వెన్నెల్లో నిలబడి ఎదురు చూస్తూన్న మనిషితో బాటు అదృశ్యం అయ్యాడు.

వాళ్ళు వెళ్ళినవైపు తీక్షణంగా చూసి, వెనక్కి మళ్ళాడు గృహస్థుడు. లుంగీ బిగించి కట్టుకుని వంటగదిలో ప్రవేశించాడు. ఎవరు ఎవర్నీ పలకరించుకోలేదు. నాలుగు మెతుకులు ఎంగిలిపడి, లేచి తువ్వాలుతో చెయ్యి తుడుచుకొంటుండగా, ఇంటిముందు రిక్షా ఆగిన చప్పుడు అయింది.

కళ్ళు గుచ్చి గుచ్చి చూశాడు, వెన్నెట్లోకి ఓ చంటిపిల్లవాణ్ణి బుజాన వేసుకుని ఒక స్త్రీ లోనికి వచ్చింది.

"ఏం! అత్తయ్యా, ఇంత పొద్దుపోయాక వచ్చావ్?" చదువుకుంటూన్న కస్తూరి లేచి, ఎదురుగా వెళ్ళి పిల్లవాణ్ణి అందుకుంది.

"అసలు పెందరాళే వద్దామనుకున్నా. కానీ. వీడికి ఒళ్ళు వెచ్చగా ఉంటే, డాక్టరమ్మకు చూపెట్టి వస్తున్నా. అయితే. నాన్నగారు ఇంటికి వచ్చారా కస్తూరీ !' ఆయాసంగా మాట్లాడింది.

"ఎప్పుడో వచ్చారు...వంటగదిలో ఉన్నారు."

"వచ్చారా? హమ్మయ్య! నాకు గుండెల్లో గుండెలు లేవు!" కళ్ళలో నీళ్ళు ఒత్తుకుంది.

"ఏమయింది అత్తయ్యా! నీ 'నెక్లెస్' నీకు సురక్షితంగా చేరుతుంది. మామయ్య ఇప్పుడే వెళ్ళాడు. ఒక అరగంట క్రితం..." చెయ్యి తుడుచుకుంటూ మధ్య గదిలోకి వచ్చాడు అతను.

"నగల కేమమ్మా...పాడు నగలు. ఈవేళ కాకపోతే, రేపు కొనుక్కుంటాం. పాడు ... అపనిందలు ఎలా భరిస్తాం?"

"నగలు తాకట్టు పెట్టినంత మాత్రాన మన గౌరవానికేం భంగం రాలేదు అత్తయ్యా పరిస్థితులు మానవుణ్ని తారుమారు చేస్తాయి. ఇంత చిన్న విషయానికి మన పరువు బజారు పాలయిందనుకొంటే ఎలా?"

ఆయన యథాలాపంగా వాలుకుర్చీలో కూలబడ్డాడు. పక్క గదిలో వక్కపొడి డబ్బా మూతతీస్తూ.

"నాకే మనస్సు ఎలానో అయిపోయిందమ్మా. పాపం. వదినగారు ... అసలే ఆమెకు గుండెదడ. ఎలాగుంటుందోనని పరుగెత్తుకుని వచ్చా."

"ఇంత చిన్న విషయానికి గుండెదడ దేనికి?"

"నీకు అనుభవం తక్కువ కస్తూరీ! డబ్బుపోతేపోయింది. పోలీసులతో ఎంత గొడవ. పద. అమ్మను చూద్దాం." లోనికి వెళ్ళారు.

"నాకు మధ్యాహ్నమే తెలిస్తే అప్పుడే వచ్చేద్దును. వదినా! అయితే, ఇప్పుడు అన్నీ తేలిపోయాయి కదూ!"

"ఏమిటమ్మా?"

"అదే అన్నయ్య సంగతి".

"వారి కేమయిందని?"

"పోలీసులు పట్టుకెళ్ళారటగా!"

"ఎవరిని? ఏమిటి? నీకేమైనా పిచ్చిగాని పట్టలేదుగదా. కూర్చో" చాపవేసింది. వాళ్ళ చుట్టూ మూగారు.

"అన్నయ్యగారి ఆఫీసులో అయిదు వందల రూపాయలు పోయాయిట గదా? ఆ నింద అన్నయ్యమీద మోపారని చెప్పాడు వీళ్ళ నాన్న" చంటిపిల్లవాణ్ని చూపెట్టింది.

"తరవాత..." కస్తూరి నవ్వు దాచుకుంటూ అడిగింది.

"అయిదు వందలు కట్టి, బావగారిని రక్షించుకోపోతే నేను ఉండి ఎందుకు? మన పరువు ప్రతిష్ట గంగలో కలుస్తాయని నా నగలన్నీ తీసుకు పచ్చాడు...అమ్మి, డబ్బు కట్టి, అన్నయ్యని విడిపించాలని చెప్పాడు, తమ్ముడు."

ఆ మాటలన్నీ విన్న ఇంటి కామందు గాలివానలా, విసురుగా వాలాడు ఆ మహిళా మండలి మధ్య.

"నే చెబితే విన్నావా? ఇదేదో పెద్ద ఎత్తు వేశాడంటే, విన్నావా. తిక్క కుదిరింది పో! పిల్ల ఒంటిమీద నగలు, డబ్బు అన్నీ ఒక్క దెబ్బన తుడిచిపారేశాడు. పోండి! నోరెత్తారా; గొంతుపిసికి పారేస్తా... చూస్తా నా గడప తొక్కమను, ఇది మొదలుకుని..."

ఆడవాళ్ళు పిల్ల జెల్ల అందురు బిరబిరమంటూ పెరట్లోకి నడిచారు.

"ఏమండోయ్! భోజనాలయ్యాయా? పాడు వడగాలి తొమ్మిదయినా తగ్గలేదు."

"అహాఁ, రండి, రండి" అంటూ ముఖ కవళికలు మార్చుకుని, అతను వాకిలికి ఎదురుగా నిలబడిన అతిధిని ఆహ్వానించాడు. పీఠి అరుగు మీద చతికిలబడ్డారు ఇద్దరు.

"ఏమిటి! ఏం ఈ రోజు కాంటీన్‌కి కూడా రాలేదు? తీరికలేదా?" వచ్చిన పెద్దమనిషిని ప్రశ్నించాడు.

"తీరికలేకేమిటిలెండి? చస్తేనే తీరిక. ఆ 'మనువర్తి దావా' నకళ్ళు, అవీ తయారుచేసి, డబ్బు కట్టడంతో సరిపోయింది. మీకు తెలియనిది ఏముంది" అతను జవాబిచ్చాడు.

"నాకేం తెలుసు. భలేవాళ్ళే!"

"సరిపోయింది. మీకు తెలియకపోతే నాకేనా తెలిసేది? మీ బావమరిది శ్రీనివాసమే వచ్చి, మా ప్లీడరుగారికి అయిదువందల రూపాయలు ఇచ్చి వెళ్ళాడు. మిగతా డబ్బు రేపు చూస్తానన్నాడు. మీరుకూడా యీ పైన సర్దుతామన్నారుటగా, అవునా?"

తల ఊపాడు ఖాళీగా, ఔనన్నట్లో కాదన్నట్లో తెలియకుండా.

"అదే నేను చెప్పేది. అసలు నాకు తెలియక అడుగుతాను. ఈ కేసులో మీవాడు ఎందుకు తిరుగుతున్నట్టు? సరోజమ్మకు, మీ వాడికీ ఉన్న సంబంధం ఏమిటి?"

"సంబంధమేమిటీ? తెగించినవాళ్ళకు?"

"అంతేలా ఉంది! రామ, రామ. మీరు చూశారా; తలచెడినట్టు ఉంటుందా? దాని కట్టు, బొట్టు ముత్తయిదువులానే ఉంటుంది. ఒక్క రిక్షాలో పక్క పక్కనే కూర్చుని వచ్చారు, ఆవేళ మా ప్లీడరుగారి వద్దకు."

"ఇక ఆ విషయాలు చెప్పకండి, పోయేకాలం వస్తే, ఏం చేస్తాం. అవ్వ! ఫలానా కోదండరామయ్యగారి బావమరిది ఈలాంటి వాడంటే, నా పరువు పోతుంది."

"అయితే మీ కళ్ళు కప్పి చేస్తున్నాడన్నమాట. ఇదంతా. కొద్దిగా అగ్గిపెట్టె ఇప్పించండి" అన్నాడు, చుట్ట కొరుక్కుంటూ ప్లీడరు గుమాస్తా.

"ఒరేయ్, గోపాలం అగ్గిపెట్టె తీసుకురా. చూడండి, ఎన్ని వేలకు వేయించాడు మా వాడు దావా?"

"వేలేం ఖర్మ. పొలం గట్రా అన్నీ లెక్క చూసుకుంటే. లక్ష న్నర దాదాపు ఉంటుంది."

"దానికి ఉన్న ఆస్తి చాలక ఇంకా భర్త తరపున ఆస్తి ఎందుకు దానికి? ఎవడికి కట్టబెట్టడానికి?"

"అదేమన్న మాటలెండి. ఎవడికి తినడానికి ప్రాప్తం ఉంటే, వాడికి దక్కుతుంది. మీవాడు అగ్గిపెట్టె తేనేలేదు. సరేలెండి, ఇంటికి వెళ్ళి కాళ్ళుచాచుకుంటా నిద్రకూడా వస్తూంది."

ప్లీడరు గుమాస్తా నిష్క్రమించాడు.

* * *

ఆవేళ సాయంత్రం 5 గంటలకు 'ఫైల్స్' అన్నీ ముడివేసి, పర సగా అమర్చుకుని. మరొక్కసారి బల్లచుట్టూ పరికించి చూశాడు కోదండ రామయ్యగారు. ఏదో దరఖాస్తు కిందపడిఉంటే, పేపర్ వెయిట్ కింద పెట్టి, కోటు బుజాలకు ఎక్కించుకోసాగాడు.

"సార్! అయ్యగారు రమ్మంటున్నారు." ప్యూన్ వార్త మోసుకు వచ్చాడు. అతణ్ని అనుసరించి 'స్ప్రింగ్' తలుపులు నెట్టుకుని, కలెక్టరుగారి బల్ల దగ్గిరగా ముందుకువంగి నిలబడ్డాడు, చేతులు వెనక్కి కట్టుకొని.

"ఈ శ్రీనివాసరావుగారిదేదో 'అప్లికేషన్' ఉందట చూడు, చక్కెరకోటా పర్మిషన్ బాపతు. త్వరగా నా వద్దకు పట్రా." ఇంగ్లీషులో కూశాడు. తలఎత్తి టేబిల్ ముందున్న వ్యక్తికేసి చూశాడు. ఖాదీ సిల్కు లాల్చి, బంగారపు ఫ్రేముతో ఉన్న చలవ అద్దాలు పెట్టుకున్న కళ్ళు పేపరు చూస్తున్నాయి. రెప్పపాటులో చూపు మరల్చుకుని, తన సెక్షన్‌కు వెళ్ళి, 'ఫైలు' తెచ్చి వారిముందు పెట్టి వినయంగా నిలబడ్డాడు.

"రేపు ఈ విషయం చూస్తా, వెళదామా?" అంటూ చొంగ నోట్లో పెట్టుకుని లేచాడు ఆఫీసర్. ఇద్దరూ మాట్లాడుకుంటూ, దిగుతూంటే,

కోదండరామయ్యగారు నాలుగడుగులు వెనక్కి తగ్గాడు. పోర్టికోలో వచ్చి ఆగాయి. జీప్, చిన్నకారు. రెండు ఒకదానివెంట మరొకటి జారిపో యాయి.

అతను నోరు తెరుచుకుని వెళుతూన్న చిన్నకారుకేసి చూస్తూ ఉండి పోయాడు !

"ఏమండోయ్ ! రామయ్యగారూ? ఇంటికి వచ్చేది లేదా?" జిల్లా కోర్టు ప్రహరీ అవతలనుండి ప్లీడరు గుమాస్తా శేషాద్రి కేక వెయ్య టంతో ఈ లోకంలో పడ్డాడు. మళ్ళీ ఒకసారి తన బల్లవద్దకు వెళ్ళి, అన్నీ సర్దుకుని మిత్రునితో అడుగులు కలిపాడు.

"ఈవేళ పేపరు చూశారా?"

"ఏమిటి? కొత్తగా అడుగుతున్నారు! అయిదా రేళ్ళు అయింది పేపరు చూసి."

"అదికాదండీ, చైనావాళ్ళ సంగతికాదు. మీ బావమరిది శ్రీనివాస రావుగారు..." గుండ్రంగా మడిచిన పేపరు మడతవిప్పి, ఫోటోమీద వేలువెట్టి చూపించాడు.

"కుడినుండి మూడవ వ్యక్తి శ్రీనివాసరావుగారు..." చదివి, మళ్ళీ పేపరు యథావిధిగా మడిచి పారేశాడు.

"మీవాడికి 'మినిష్టరీ లెవెల్'లో కూడా బాగా పలుకుబడి ఉన్న ట్లేగా! రామయ్యగారూ, పిల్లలు కలవాణ్ని. మీరు నా కొక సహాయం చేసిపెట్టాలి."

"అయ్యో రామ ! ఆమాత్రం నమ్మకం లేకపోతే ఎలా ? మేము మాత్రం గడిచి గట్టెక్కామా ? కాని, డబ్బుమాత్రం ..." నసిగాడు.

"సరే. నెలాఖరని నాకు తెలియదూ ? అదికాదు. మా పెద్దవాడు పి. యు. సి. తప్పి ఊరికే తిరుగుతున్నాడు. కాబట్టి మీ బావమరిది శ్రీని

వాసరావుగారితో చెప్పి వాణ్ణి ఆ జిల్లా పరిషత్తులో కాస్త గుమాస్తాగా వేయించుదురూ? పుణ్యం ఉంటుంది వాడు పదిరాళ్ళు సంపాయిస్తే."

పచ్చి వెలక్కాయ గొంతులో పడ్డంతపనిఅయింది!

"శేషాద్రిగారూ. మావాడికి నిజంగా అంతపలుకుబడి ఉందంటారా? మీ పిచ్చిగానీ. అడ్డగాడిద ... ఏదో నలుగురు నాయకులవెంట తిరగగానే వాడేదో పెద్ద "ఇదయి పోయాడని అనుకోకండి!"

"అక్కడే మీరు పొరబడుతున్నారు. రోజులు వాళ్ళవి. ఒప్పుకోండి. మీరు చూస్తుండగా కలెక్టరుగారితో కలిసి వెళుతున్నాడా?"

అంగీకార సూచనగా తల వూపాడు.

"దేనికయినా, డబ్బుండాలి రామయ్యగారూ, డబ్బు ప్రధానం. ఆ సరోజమ్మ పుణ్యమా అని అన్నీ అమిరాయి. మనలాంటి చిన్న చిన్న కుటుంబాలలో ఈవిధంగా జరిగితే అందరు వేలెత్తి చూపెట్టకపోయారూ! ఏది చేసినా పెద్దవాళ్ళకు చెల్లుతుంది. ఆవేళ మీవాడు దావాలో ఎందుకు తిరిగాడో. కీలకం ఇప్పటికయినా అర్థమయిందా? దానికి వెనక, ముందు ఎవరు లేరు.'

"కాని, దానికి ఈ వయస్సులో ఇదేం పొయ్యేకాలం. మావాడికన్నా ఓ అయిదారు అదే యెక్కువ అనుకుంటా."

"వయస్సేమిటిలెండి ఈ విషయంలో! కాని, మొత్తానికి అలాంటి కామధేనువు ఒకటి ఉండటం అదృష్టమే. మీవాణ్ని అంటున్నానని ఏమి అనుకోకండి. అటు అంతా తిరిగిపోయేదానికంటే, ఇటు రైలు కట్టదాటి, దాంట్లోగుండా దూరిపోతే, సరిపోదూ?" ఇనప కటకటాలకేసి చూపెట్టాడు.

"ఒక అడుగు దూరమయినా, మంచిదారిలో నడుద్దాం."

"సింగినాదం, రండి;" ఇద్దరూ చెక్క వంగలేదని నిర్ణయించు

కుని, ధోవతులు పైకి తీసుకొని, జాగ్రత్తగా సిగ్నల్ తీగెలుదాటి, కట్ట దిగి, ఇనుప కటకటాల మధ్యగా దూరి, రోడ్డుమీద పడ్డారు.

"సరే, నేను పెద్దబజారు మీదుగా వస్తా, పంచదార కూపన్ కొత్తది ఇస్యూ చేస్తామన్నారు. ఇంతవరకు అతిలేదు, గతిలేదు!" కోదండరామయ్యగారు అన్నారు.

"అలానే. మళ్ళీ చక్కెర ఎప్పుడు వస్తుందో కనుక్కోండి. మరి నేను చెప్పిన విషయం. ఇవాళ భోజనాలు అయ్యాక శ్రీనివాసరావుగారి ఇంటికి వెళదాం. ఏమంటారు?" దిక్కులు చూశాడు కోదండరామయ్యగారు. గుటకమింగి సమాధానం చెప్పడానికి ఉద్యుక్తుడయ్యాడు.

"అదికాదండీ. నేనొకటి చెబుతాను, మీరేమి అనుకోకపోతే. ఈ లాంటి నీతి నిజాయితీలేని వెధవలతో నేను మాట్లాడనండి. గుట్టు చక్కగా దేవుడు ఇచ్చినంతలోనే కాలం వెళ్ళదీయటం నా సిద్ధాంతం, ఎక్కడి వరకు ఎందుకు? మూడేళ్ళనాడు రావలసింది నా ప్రమోషన్."

"ఇటు పక్కకి రండి! ఈ లారీ వాళ్ళు కళ్ళు మూసుకుని నడుపుతారు. నేను చెప్పేదికూడా అదేనండి. మీకంటె జూనియర్లకు సూపరింటెండెంటు ప్రమోషన్ ఇచ్చారా? ఎలా? రికమండేషన్. అంతే! సీనియారిటీ ప్రకారం ఇస్తున్నారా? మీ శ్రీనివాసరావుగారు తలుచుకుంటే చిటికెలో పని."

"సరే. నా విషయం పోనీయండి. మీ అబ్బాయి విషయం ఎలా చేద్దాం. అయితే, నేనుమాత్రం వాడి దగ్గరకు వెళ్ళను."

"ఆ. రామలక్ష్మమ్మగారిద్వారా ఈ పని అవుతుంది. మీరంటే, ఎలా అయినా పరాయివాళ్ళు. కానీ, తమ తోబుట్టువు. మాట తీసివెయ్యలేదు. ఏమి అనుకోకుండా రేపు ఓసారి వెళ్ళి ఆయన చెవిని వేసిరమ్మని చెప్పండి."

"సరే, అలాగే. భోజనాలు అయ్యాక వస్తారుగా." కోదండ

రామయ్య పెద్ద బజారువైపు పురోగమించాడు. ప్లీడరు గుమాస్తా ఇంటి వైపు తీసుకువెళ్ళే సందులో చొరబడ్డాడు.

* * *

రెండవరోజు రామలక్ష్మమ్మగారు రిక్షా దిగింది. గేటు బయటనుండి లోపలికి చూసింది. అందమైన చిన్న బంగళా. పూలకుండీలలో వికసిస్తూన్న రంగు రంగుల పువ్వులు, క్రోటన్ మొక్కలు, కిటికీలకు, ద్వారబందాలకు ముచ్చటైన పరదాలు వేలాడుతున్నాయి. ఎలుగుగొడ్డులాంటి 'అల్సేషియన్' కుక్క తల నిమురుతున్నాడు నౌకరు. సైగచేసి వాడిని బయటికి పిలిచింది. కుక్కతో సహా పరామర్శించడానికివచ్చాడు వాడు.

"ముందు దాన్ని తోలు!" ఆమెగొంతు వణికింది.

"మావాడు శ్రీనివాసం ఉన్నాడా? ఉంటే మీ అక్కయ్య వచ్చిందని చెప్పు."

"అక్కయ్యగారు ఉట్టినే కూర్చున్నారు రండి." లోనికి తీసుకువెళ్ళాడు నౌకరు. పరదా తొలగించుతూ "ఇక్కడ కూర్చోండి." నౌకరు లోపలికి వెళ్ళాడు.

"అక్కాయ్, ఏమిటే? తమ్ముడు ఇన్నాళ్ళకు జ్ఞాపకం వచ్చాడన్నమాట. నా దగ్గిరికి అని బావతో చెప్పి వచ్చావా?" కిందివరకు ముచ్చటగా వేలాడుతున్న సిల్కు లాల్చీ. లాల్చీనుండి అతని నిండైన విగ్రహం కొట్టవచ్చినట్లు కనబడుతూంది. హుందాగా నడుచుకుంటూ వచ్చి, సోఫాలో కూర్చున్నాడు. ఇంటిముందు కారు ఆగిన శబ్దం అయింది.

ఆమె నవ్వుతూ, పెదవి కదల్చబోయింది. నౌకరు చీటి తెచ్చి అందించాడు.

"అబ్బబ్బ ఊపిరి పీల్చుకోనివ్వరుకదా. దొంగముండాకొడుకులు. ఒకడి తరవాత ఒకడు. విసుగు విరామం లేకుండా! సరే, ఏడవమను!" ఇంకా రెండు తిట్టి, ఠీవిగా కూర్చున్నాడు. బంగారపు ప్రేము సులోచ

నాల జోడు తుడుచుకొని, ముక్కుమీదికి ఎక్కించాడు. ఆమె పక్క గది లోకి నడిచింది.

అతిథి ప్రత్యక్షం అయ్యాడు. చంకలో తోలుసంచీ జారిపోకుండా చేతులు కలిపి "నమస్తే" అన్నాడు.

"నమస్తే. రండి. రండి ఏమిటి విశేషాలు. ఈ మధ్య కనబడటం లేదు. అంతేలెండి ! మళ్ళీ అవసరం వచ్చేదాకా జ్ఞాపకంరాము." కరచా లనం చేస్తూ అన్నాడు.

"అయ్యయ్యో ! ఎంతమాట సెలవిచ్చారు. వాడిని అడగండి.ఎన్ని సార్లు మీకోసం వచ్చానో !" గేటుకేసి చూపించాడు.

"అలానా ! వాడు నాకెప్పుడూ మీ విషయమే చెప్పలేదు ! సరే, ఏమిటి విశేషాలు ?"

"ఆ విషయం ఆలోచించి, వచ్చారా ?"

"ఏ విషయం ?"

"అదే, ఆ సిమెంట్ లైసెన్సు విషయం. కనుక్కోమని చెప్పాను?"

"అదా రెండుసార్లు నేనే స్వయంగా వెళ్ళాను. రెండుసార్లు మినిష్ట ర్‌కి ఫోన్ చేయించాను. అప్పుడది సెక్రెటరీ టేబిల్‌మీదికి వచ్చింది. ఇక మిగతా రెండు రోజులు దానితో సరిపోయింది. అదే మీ పక్కఊరు ...వాళ్ళ కో - ఆపరేటివ్ రూరల్ బాంక్ ఎలక్షన్స్‌కు 'స్టే ఆర్డరు' తీసుకురావడంతో సరిపోయింది. ఎలెక్షన్ వాయిదా వెయ్యకపోతే, చిన్న ముఠా వస్తుందని ఒకటే గోల, ప్రెసిడెంటు పార్టీ. ఆ పని పూర్తి అయ్యేటప్పటికి, నా తాతలు దిగివచ్చారనుకో ! హైదరాబాదు వెళుతున్నా నంటే చాలు, సవాలక్ష పనులు చెబుతారు."

"అయితే మనపని ఎప్పుడు చేయిస్తానంటారు ?"

"చూద్దాంలే, ఈసారి హైదరాబాద్ వెళ్ళినప్పుడు !"

"ఎప్పుడో వెళ్ళినప్పుడు చూస్తానంటే, ఎలాగండీ?"

"మరేం చెయ్యను చెప్పండి. కాలు కదపటానికి వీల్లేని పనులు. చూస్తున్నారుగా రేపు మీ ఊరు 'ప్రోగ్రాం.' ఉంది. ఏమిటీ ఆ రెడ్లు? 'కాలవ' మా కక్కరలేదు, ఊరు పెద్ద చెరువు బాగుచేయించాలని, సంత కాలు పెట్టి పంపించారు. వాళ్ళకు వైస్ ప్రెసిడెంటు' వస్తే ఈ పేచీ ఉండదనుకుంటా. ఈ రాజీ చెయ్యటం ఒక పదిరోజులు పడుతుంది. అవ తల నెలలో సి. యమ్. విజిట్ ఉంది. నేను ఉండక తప్పదు. సరే, ఈ సారి హైదరాబాద్ వెళ్ళినప్పుడు చూస్తా. మళ్ళీ, మనం వెళ్ళి కదిలించే వరకు ఆ ఫైలు కదలదు. ఆ కొత్తపాలెంవాళ్ళ స్కూలు ప్రారంభో త్సవం. 'సి. యమ్. ప్రోగ్రాంలో ఇరికించాలనుకొంటున్నాము. ఆ సందర్భంలో చూస్తా."

" అప్పటికి మీకు పనులు తక్కువవుతాయా, కాబట్టి ప్రత్యేకంగా ఈ పనిమీదనే పోయిరావాలి."

"చూద్దాంలెండి, వీలునుబట్టి."

"చూద్దామంటే, కాదు. రేపే బయల్దేరాలి. అయిదు చాలుగా." చేతి వేళ్ళు చూపుతూ, సైగ చేశాడు వచ్చిన పెద్దమనిషి. కొద్దిగా తగ్గు స్థాయిలో స్వరం దించుకొని.

"చాలటానికేముందిలెండి, అవసరమైతే మళ్ళీ చూసుకోవచ్చు. చెయ్యి తడుపుతూనే ఉంటాము. పని కానివ్వరు.'' జిప్‌లాగి ఒక నోట్ల కట్ట బయటకు తీసి, జిప్ వెనక్కి లాగాడు. తోలుసంచి చేతిలో పట్టుకొని లేచాడు. "మళ్ళీజ్ఞాపకం చేయవలసిన పనిలేదుగా?" అంటూ, నవ్వు కుంటూ నిష్క్రమించాడు. శ్రీనివాసరావుగారు నవ్వుతూ, అతనితో నాలు గడుగులు వేసి, వెనుదిరిగాడు. నోట్లవంక విస్తుపోయి చూస్తూన్న రామలక్ష్మమ్మ మళ్ళీ ఈ లోకంలో పడడానికి రెండు నిమిషాలు పట్టింది.

తన రక్తం పంచుకున్న సోదరుడు ఇంతవాడు అయినందుకు ఆమె హృదయం పొంగిపోయింది.

"ఒరేయ్ తమ్ముడూ, నీ తెలివి తేటలకు తగ్గట్టు మీ బావగారిలా, బి. ఎ. చదివితే, ఎంత పైకిపోయి ఉందువోరా !"

"అక్కాయ్ ! పిచ్చిదానివే నువ్వు, నేను బావలా బియ్యే, గియ్యే చదివితే, నేనూ ఎక్కడో గుమాస్తా గిరో, పంతులుపనో వెలగబెట్టేవాణ్ణి! తెలిసిందా ! తన ప్రమోషన్ గురించి పంపాడా నిన్ను ?" అని బిగ్గరగా నవ్వాడు.

ఆమె నోటివెంట మాటరాలేదు !